# నెచ్చెలి

"మీ కొత్త నవల కిస్‌కిస్ నా మనసు దోచుకుంది. ఇన్నాళ్ళూ, మా ఆయనతో చేసిన సంసారం అంతా తలుచుకుంటే డోకొస్తోంది. సరసం విరసం తెలియని ఆ మొద్దు రాచ్చిప్పతో ఇన్నాళ్ళూ, సహజీవనం ఎలా చేశానో అర్థం కాలేదు. ఇంక నాకు ఈ జీవితం లోంచి విముక్తి ఎలా వస్తుంది ? వెంటనే చెప్పండి ప్లీజ్....

'సువర్చల....
కాకినాడ

"ఇప్పటికయినా మీరా మొద్దు గురించి తెలుసుకొన్నందుకు సంతోషం. మీరు చింతించకండి, నా రాబోయే నవలలో అలాంటి సన్యాసులకు బతుకంటే ఒక కిక్ అనిపించే వెయ్యి చిట్కాలు చెబుతాను. ఫాలో అవ్వండి...."

వళ్ళు మండే కోపంతో సుందరం పుస్తకం విసిరిపారేశాడు.

"మీ బొంద ఫాలో అవ్వండి....నేను మొద్దునా....? వాడి దృష్టిలో సన్యాసినా....? నీ పేరు పిచ్చి తగలెయ్య! నా యింటి పేరుతో సహా అడ్రస్‌తో సహా యిచ్చేస్తే రేపు నేను ఆఫీసులో ఎలా తలెత్తి తిరిగేది బాబోయ్....!"

"ముఖ సౌందర్యానికి మూడు చిట్కాలు" వ్యాసంలో చెప్పినట్లు మొహం నిండా దోసముక్కల మాస్క్ అతికించుకుని మిగతా భాగం టమోటారసం పులుముకొని అయిదు నిముషాల పాటు ఆరనివ్వాలి అనే కార్యక్రమంలో ప్రాక్టికల్‌గా ఉన్న సువర్చల మాట్లాడలేదు. సుందరం గిరవాటు కొట్టిన వీక్లీ ఏ మూలకు వెళ్ళిందోనని మాత్రం అలా కళ్ళు విప్పి పరికించింది. గట్టిగా దెబ్బలాడేందుకు ఆ క్షణంలో వీలులేకపోయింది. కదిలితే దోసముక్కలు ఊడిపోతాయని సంజ్ఞ చేసి చూపించింది.

"అవ్వవ్వవ్వ....పేరు, ఊరు, ఇంటినెంబరు, వెలగబెట్టే ఉద్యోగంతో సహా చేతిలో పెన్ను ఉందికదా అని రాసిపడేసి నన్ను వెర్రి పీనుగను చేస్తావుటే. నేను ఆఫీసులో మొహం ఎలా ఎత్తుకోనే బాబూ!'

సుందరం తలపట్టుకొని సోఫాలో వాలిపోబోయాడు. కాని అప్పటికే ఆ సోఫాలో పడుకొని ఉన్న 'శరభ్' కెవ్వుమనటం, వాడక్కడ వున్నాడని తెలియక వాడిమీద పడిపోయిన సుందరం అంతకంటే ఎక్కువగా బేర్ మంటం క్షణంలో జరిగిపోయింది

"ఇదేమిట్రా స్కూల్‌కి ఎందుకు వెళ్ళలేదు నువ్వు" అన్నాడు సుందరం

ఆశ్చర్యంగా, వాడు అంగుళం కూడా కదలకుండా సువర్చలవైపు ఓసారి చేయిచాచి చూపించి మళ్ళీ ఎప్పటిలా అదే ఫోజుతో సోఫాలో పడుకుండిపోయాడు.

"ఏమయిందిరా?"

"మా స్కూల్లో నన్నంతా 'పిచ్చాడు' అని వెక్కిరించారు. చివరకు మా మిస్ కూడా....

శరభ్‌గాడి గొంతు పూడిపోయింది దుఃఖంతో.

"నీకు పిచ్చేమిట్రా?" సుందరం నోరు తెరిచాడు ఆశ్చర్యంగా.

వాడు తండ్రివైపు దీర్ఘంగా చూసి వారపత్రిక తాజా ప్రతి తీసి అందించాడు తండ్రికి.

గబగబా పేజీలు త్రిప్పి చూశాడుసుందరం. "రకరకాల పిచ్చిలు నివారణకు సూచనలు" శీర్షికలో శరభ్‌గాడి ఫోటో క్రింద ప్రశ్న ఉంది.

"డాక్టర్! వీడు ఎప్పుడూ విచిత్రంగా ప్రవర్తిస్తూ ఉంటాడు. మనం ఏది చెయ్యొద్దు అంటామో అది తప్పకుండా చేస్తానంటాడు. వాడికి తోచదు. చెబితేవినడు. ఇది పిచ్చేనంటారా?"అన్న సువర్చల ప్రశ్న ఉందందులో. ఆ ప్రశ్నకు సమాధానంగా.

"ఖాయంగా ఇది పిచ్చే! వెంటనే మా ఆస్పత్రిలో సంప్రదించండి. లేకపోతే అందర్నీ కరిచేయగలడు" అన్న సమాధానం వాడి స్కూల్ అడ్రస్‌తో సహా వేసి ఉంది

తండ్రి చదివాడని తెలిసి శరభ్‌గాడు దీనాతిదీనంగా తలెత్తి ఇప్పుడేమంటావ్ అన్నట్లు చూశాకే కన్నతండ్రి హృదయం కరిగిపోయింది.

"అసలు నా పేరులోనే పిచ్చి వుందట మా మిస్ చెప్పింది" అన్నాడు వాడు ఏడుపు మొహంతో.

"ఎవత్రా అలా అన్నది. శరభ్ హీరోగా మూడేళ్ళపాటు పాఠకులను ఉర్రూతలూగించిన 'అశ్వరథ శరభ' సీరియల్ చదవలేదా ఆవిడ....ప్చ్....బొత్తిగా టేస్ట్ లేకుండాపోతోంది." అంది సువర్చల, అప్పటికి ఐదు నిముషాలు పూర్తి కావటంతో దోసముక్కలు తీసిపడేసింది.

సుందరానికి గట్టిగా అరిచేందుకు కూడా ఓపికలేదు. "ఇలాటి పిచ్చిపనులు చేసి మమ్మల్ని ఎలా బయట తిరగమంటావే? వాడు పిచ్చివెధవ నేను వెర్రి పీనుగు అన్నట్లు నీ లేఖల్లో ప్రదర్శించావు. నువ్వే చెప్పు యిప్పుడు ఏం చేయమంటావో?" అన్నాడు జాలిగా.

"అలా ఏడ్పు మొహం పెట్టకండి. నాకసహ్యం. బయట తిరగటానికి భయమెందుకు ?అన్న కాసా రాసిన పుస్తకం చదవండి. మీ భయాలన్నీ ఇట్టే పోతాయి". అంది కోపంగా సువర్చల.

"నాన్నా నేను సుబ్బారావు అని పేరు మార్చుకుంటా నాన్నా ఆ పేరు చాలా మందికి ఉంటుంది. అల్లాగయితే నన్ను పిచ్చి వెధవ అనకుండా ఉంటారేమో" అన్నాడు సుపుత్రుడు.

సుందరం గుండె కరిగి నీరవబోయింది.

కాని "భోజనానికి వస్తారా రారా?" అన్న సువర్చల అరుపుతో వెంటనే ఘనీభవించింది. "ఏరా తిండి తినవా" అన్నాడు కొడుకుతో. వాడు తలెత్తి సాను భూతిగా తండ్రివైపు చూశాడు. "నువ్వు తినిరా నాన్నా బావుంటే నన్ను పిలు" అన్నాడు జాలిగా.

"మళ్ళీ కొత్త వంటకమా?" అని సుందరానికి కంగారు పుట్టింది.

"రండి. వస్తున్నారా లేదా? ఇప్పటికే ఒక్క నిముషం ఆలస్యం. 10 గంటలకే నేను బ్రేక్‌ఫాస్ట్ చెయ్యాలి."

"ఇదేమిటి? ఇంకా ఏమీ వొండలేదుగా. ఎందుకా గావుకేకలు...." అన్నాడు సుందరం. డైనింగ్ టేబుల్ దగ్గర కూలబడి.

"వొండకపోవడమేమిటి?" ఆశ్చర్యంగా అంది సువర్చల. ప్లేటులో టమోటాలు, చక్రాల్లా తరిగిన ఉల్లిపాయలు, నిమ్మ, దోస, రకరకాలవి అందంగా పేర్చి కొత్తిమీర చల్లి.... ఉన్నాయి.

"ఇదేమిటి" అన్నాడు తేలుకుట్టినట్లు ఉలిక్కిపడి సుందరం.

"మీరలా అసహ్యంగా ప్రతిదానికి ఉలికులికి పడకండి, ఆరోగ్యం చెడిపోతుంది. మనసు ప్రశాంతంగా ఉంచుకోవాలన్నా టెన్షన్ లేకుండా ఉండాలన్నా స్వాతికాహారం తినాలి...."

కెవ్వుమన్నాడు సుందరం.

"అంటే ఇవన్నీ ఇలా....తిని టెన్షన్ లేకుండా ఉండాలా? మూడు పూటలా ఇవే తినాలా?" అన్నాడు ఏడుపు మొఖంతో.

"వై నాట్....కాకపోతే రెండు చపాతీలు కూడా తింటాం" అంది సువర్చల టమోటాలు ఉల్లిపాయలు కలిపి కరకర నమిలేస్తూ.

"ఇక మీదట పొద్దున్నే ఇడ్లీలో, ఉప్మానో చెయ్యనా" అన్నాడు సుందరం బెంగగా.

"మాట్లాడకండి. అవన్నీ హెవీ వెయిట్. ఇప్పటికే అవన్నీ తిని తిని మీకు కొండలాంటి బొజ్జ వచ్చేసింది. చూసుకోండి. ఐదేళ్ళ క్రితం పిట్టలా ఉండేవారు. ఇప్పుడు పాత్రంలా తయారయ్యారు" అంది సువర్చల, క్యాలెట్ ముక్కల పని పడుతూ.

సుందరం గుటకలు మింగాడు.

"నేనవి తినలేనే బాబూ నన్ను వదిలేయ్! శరభంగాడికి కూడా ఇవ్వేనా....?"

సువర్చల మొహం రంగులు మారింది. "శరభం ఏమిటి గార్దభంలాగా అనయ్యంగా" అన్నది చిరాగ్గా.

"నాన్నా పక్కింటి లోకనాథం గారొచ్చారు. ఎందుకో కోపంగా ఉన్నారు. నీతో అర్జంటుగా మాట్లాడాలిట" అన్నాడు శరభ్.

"కోపమా? ఎందుకట...." సుందరం నీరసంగా డైనింగ్ టేబుల్ దగ్గర నుంచి లేచివచ్చాడు.

హాల్లో లోకనాథం కోపంగా చూస్తూ నిలబడి ఉన్నాడు.

"అదేమిటండీ నిలబడే ఉన్నారు....కూర్చోండి" అని మర్యాద చేశాడు సుందరం.

"అక్కర్లేదులెండి....ఇలా ముఖ ప్రీతిమాటలు మాట్లాడడం, వెనకాల గోతులు తవ్వటం మాకు అలవాటు లేదులెండి" అన్నాడు ఆయన మొహం ముట ముటలాడిస్తూ.

సుందరం వెర్రిమొహం వేసి ఆయనవైపు చూశాడు.

"ఏదో ఇరుగుపొరుగు వాళ్ళం, మీకు ఇష్టం వుంటేనే మాతో మాట్లాడండి. లేకపోతే లేదు. అంతేగానీ మా పేర్లు ఇలా పేపర్లకెక్కిస్తుండటం ఏమైనా బావుందా...." అన్నాడు ఓ పేపర్ విసిరికొట్టి.

"ఏమైందండి" అన్నాడు సుందరం, హీనస్వరంతో.

"తమరే చిత్తగించండి" అని ఆయన అంగలు పంగలు వేసుకుంటూ వెళ్ళిపోయాడు.

బిక్కుబిక్కుమంటూ, పేపరు తీసి చూశాడు.

"ఆదర్శ భర్త లోకనాథం" అన్న హెడ్డింగు కింద వ్యాసం. లోకనాథం ఎంత కమ్మగా వంటచేస్తాడో, అంట్లు తళతళలాడేలా ఎలా తోముతాడో వివరాలతో సహా రాసి ఉంది. ఇలా సహకరించే భర్తలుంటే స్త్రీ లోకం ఎన్నెన్ని పనులు సాధించగలరో సువర్చల బ్రహ్మాండమైన వ్యాసం రాసింది.

నవ్వు, కోపం ముంచుకొచ్చాయి సుందరానికి. "కొంప ముంచావు గదే సువర్చలా. వాడు వంటొండుకుంటే నీకేం. అంట్లు తోముకుంటే నీకేం, అదంతా పేపర్లకెక్కిస్తే నోరు మూసుకొని ఊరుకుంటారా...." అన్నాడు.

బ్రేక్‌ఫాస్ట్ ముగించిన సువర్చల చుర్రుమని చూసింది. "అదేమిటండి, మీరు చేయరు. చేసేవాడిని సహించరు. ఇంత అనుమానం పీనుగలను ఎలా భరిస్తాం" అంది సీరియస్‌గా.

"అనుమాన పీనుగేమిట్రా దేవుడా. పక్క ఇంటివాడు ఊరుకుంటాడుటే, ఫోటోలతోసహా వాడి జీవిత చరిత్రవేస్తే నోరు వెళ్ళబెట్టి చూస్తూ కూర్చొంటాడా,

కోపతాపాలకు అతీతంగా ఉండటానికి వాడేమన్నా బుద్ధుడి తమ్ముడా....'' అన్నాడు సుందరం చమటలు తుడుచుకుంటూ.

''ఎందుకట కోపం....ఏం తప్పు చేశానని, వెధవ వంటలు వండటం, బొచ్చెలు తోమటం ఇదేవన్నా ఆడాళ్ళ సొంతమా....ఆ చెత్తకారి పనులు ఎవర్రైనా చేయచ్చు. ఇదిగో నాకు చెయ్యటం రాదు అని చెప్పుకొంటూ కాఫీ తాగిన కప్పుకూడా కిందనే వదిలేసే రాక్షసజన్మ మీది. దేనికైనా పెట్టిపుట్టాలి. ఆ లోకనాథం పెళ్ళాం చూడండి, ఎంత సుబ్బరంగా, సుఖంగా ఉంటో'' అన్నది సువర్చల కళ్ళనీళ్ళతో సతమతమైపోతూ.

''అయితే ఏమిటంటావు? నన్నూ వంటవండి, ఇల్లు తుడుచుకోమంటావా''.... అరిచాడు సుందరం.

''ఏం ఎందుకు చేయకూడదూ. ఇదేం బ్రహ్మవిద్యా? నేను పుట్టినప్పటి నుండి చేస్తున్నానా, లేదా! హాయిగా కాలేజీలో చదివేరోజుల్లో ఎంత గ్లామరస్‌గా ఉండేదాన్ని. ఎన్నెన్ని ప్రేమలేఖలు వచ్చేవి. మీ మటుకు మీరే తప్పుల తడకల ప్రేమలేఖలు ఓ వెయ్యి రాసేరు. అంత గ్లామరస్‌గా బతికేదాన్ని కదా నేను. అన్నట్లు గ్లామరస్ అంటే గుర్తొచ్చింది ఇప్పుడు పది ముప్పయ్ అయ్యింది కదా. ఇప్పుడు ఓ గ్లాసు పంచదారలేని జ్యూస్ తాగాలి. ఉండండి వస్తాను ...''

''నావల్ల కాదు నాయనోయ్'' అని వాలిపోయాడు సుందరం.

''అప్పుడా నీవల్ల ఎలా అవుతుంది ఎంత మాత్రం కాదు. కన్నతల్లినీ, తోడ బుట్టిన వాళ్ళనీ పరాయివాళ్ళను చేయటం నీకుగాక ఎవరికి చేతనవుతుంది నాయనా.'' అన్నది వరలక్ష్మమ్మ.

ఉరుములేని పిడుగు పడ్డట్టు నిర్ఘాంతపోయాడు సుందరం.

''నువ్వెప్పుడొచ్చావే అమ్మా'' ప్రాణం లేచివచ్చింది సుందరానికి తల్లినిచూసే సరికి.

''అమ్మా కడుపు కాపురుమంటోందే. నువ్వు ఇలా హటాత్తుగా వచ్చేసి నన్ను వద్దున పదేశావుగదే అన్నాడు అమితానందంగా.

''అవున్రా నన్ను చూసేసరికి నీకు పొట్ట, తిండి గుర్తొస్తాయి. అల్లా వంట చేసే ఇలా పీనుగులాగా తయారయ్యాను. ఇంతింతపెట్టి గొప్పవాళ్ళనుచేస్తే నేనెంత చేదైపోయాన్రా'' బావురుమందావిడ.

ఆవిడ అలా ఏడ్చేసరికి సుందరానికి కంగారెత్తిపోయింది. ''నాన్నేమైనా అన్నాడా'' అన్నాడు ఉగ్రుడైపోతూ.

''ఆయన నన్నేమంటాడ్రా, ఆయనా అనేవాడూ, తిట్టేవాడూ అయితే ఇవ్వాళ ఇంత పరాభవం జరిగేదా'' ఆవిడ ముక్కు చీదుకుంది.

"ఏమైందే అమ్మా....ఇలా చాంతాడంత ఉపోద్ఘాతాలు, ఛందోబద్ధంగా తిట్టడాలు మానేసి అసలేమయిందో చెప్పు. విషయం అర్థంకాక నాకు మతిపోతోంది" అన్నాడు సుందరం కోపం ఆపుకొంటూ.

ఇంకా ఏం కావాల్రా నాయనా. ఎన్నెన్ని మాటలు పడాల్రోయ్ దేవుడా. ఒరేయ్ బాబూ, నిన్నూ నీ పెళ్ళాన్నీ నేనెప్పుడైనా పల్లెత్తుమాటన్నానా....ఇంతెడు చాకిరీ చేయించానా. నీ పెళ్ళినాడు నీ అత్తార్ని మర్యాదలు సరిగా చేయలేదని ఆ అదికాలం నాడు సణిగేనట, గోరంత జరీ చీరె పెట్టారని, నీ అక్కయ్య గొణిగిందట. అదిట్రా నాయనా అపరాధం. తీరైన చీరైనా పెట్టలేదని అవ్వాళేవో అనుకొన్నానేమో, పెద్దదాన్ని అదీ తప్పే" మళ్ళీ శోకం తీసిందావిడ.

సుందరానికి తలా తోకా అర్థంకాలేదు. నలుసంత పంచదార, ఉప్పు కూడా తగలనివ్వకుండా డైటింగ్ జ్యూస్‌ను ఆముదంలా గుటకలేస్తున్న భార్యామణివైపు, ముక్కు చీదుతూ శోకాలు పెడుతున్న తల్లివైపు అయోమయంగా చూశాడు.

సుందరం తల్లి వరలక్ష్మమ్మకి వళ్ళు మండిపోయింది.

"ఆ దేభ్యం చూపులేమిటి? ఇదిగో నా బతుకెలా బజార్న పెట్టిందో నీ పెళ్ళాం...." ఆవిడ చేతి సంచిలోంచి ఓ కాగితం తీసి సుందర్రావు మొహాన్ని కొట్టింది.

"గొణిగే అత్తలూ—ఖబడ్దార్" రచన సువర్చల....సుందరానికి కళ్ళు తేలిపోయాయి. అక్షరాలు, తాటికాయలంతేసి అయిపోయి మీది మీదికి వస్తున్న అనుభూతి కలిగింది.

"ఇదేమిటే?" అన్నాడు భార్యవైపు తిరిగి హీనస్వరంతో.

"అత్తింట్లో మీ మొదటి అనుభవం" అని కొత్త శీర్షిక వచ్చిందండీ చక్కని వ్యాసం రాస్తే మొదటి బహుమతి మిక్సీ అని వేశారు. అవ్వాళ మన పెళ్ళిలో మీ అమ్మగారి గొణుగుళ్ళు, ఇవ్వాళ విన్నంత ఫ్రెష్‌గా జ్ఞాపకం ఉన్నాయి. సహజంగా వుంటుందేమో కదా! అని....నాన్పేసింది సువర్చల.

"సహజంగా ఉంటుందని, మా అమ్మమీద వ్యాసం రాస్తావుటే నీదుంపతెగ...." ఆక్రోశించాడు సుందరం.

"అదిగో అలా తిట్టేవాళ్ళని చూస్తే నాకు అసహ్యం! నేనేగా చవగ్గా దొరకింది! అందుకే ఇలాటి దిక్కుమాలిన కొంపలో పడిపోయానని మా అమ్మ అప్పుడే కళ్ళు నీళ్ళెట్టుకొంది"

"ఏమిటీ....! ఆవిడ కళ్ళనీళ్ళెట్టుకొందా....పైగా మాది దిక్కుమాలి" కొంపని తెంగపెట్టుకొందా, ఆవిడదెంత తీరైన కొంపటా?? ఎంత మాటంది....,

"అమ్మా....అమ్మా....ప్లీజ్ కాస్త ఆగండమ్మా....నా మాట వినండే," తల్లికి భార్య యుద్ధం మొదలు పెడతారేమోనని హడలిపోయాడు సుందరం.

"ఏమిట్రా ఆపేది....నాప వెధవా, పెళ్ళాన్ని అదుపులో పెట్టుకోలేని వాజమ్మవి. నాకురా చెపుతావు. నీ కొంపలో మంచి తీర్థం ముట్టను. నే పోతా...." వరలక్ష్మమ్మ వినవిన లేచింది.

"ఏమిటీ పెళ్లాన్ని అదుపులో పెట్టుకోవాలా? అదేమన్నా పశువనుకొన్నారా? ఎంత చెత్తమనుషులండీ...." సువర్చల చిరాకుపడిపోయింది.

"అవునమ్మా మేం చెత్త మనుషులమే. నువ్వో గొప్ప దానివి పుట్టుకొచ్చావు. ఇలా అనరాని మాటలు అంటుంటే నోరు మెదపవేమిట్రా వాజా...."

"అమ్మా ప్లీజ్, నువ్వు ఇలారామ్మా! నీతో ఎన్నో విషయాలు చెప్పాలి. ముందుగా తిండి తిని రెండు రోజులైపోయిందే అమ్మా...." సుందరం దీనాతిదీనంగా ఆవిడ చేతులు పట్టుకొని వంటింటివైపు నడిపించాడు.

"బాగానే ఉంది....తిండి కూడా తినటంలేదా తండ్రీ" అంటూ ఆవిడ కళ్ళ నీళ్ళతో వంటగదివైపు నడిచింది అప్పటిదాకా జరుగుతున్న యుద్ధాన్ని మౌనంగా చూస్తూ పడుకున్న శరభ్ బొమ్మ వంటగదివైపు వెళ్ళటం చూసి అటువైపు పరుగు తీశాడు. రెండే నిముషాల్లో తిరగమోత వాసన ఇల్లంతా వ్యాపించింది. వాళ్ళు వెళ్ళిన వైపు భారంగా చూసింది సువర్చల. "అశ్శరభ శరభ" నవలలో రచయిత రాసినట్లు ఓ వైపు కనుబొమ్మ ఎత్తి దీర్ఘంగా చూడాలని ట్రై చేసింది. ఒకవైపు కనుబొమ్మ కదల్లేదు. పైగా రెండు కదలటం మొదలు పెట్టాయి. ఇలా లాభం లేదని కళ్ళల్లో ఎర్ర జీరలు తెప్పించాలని అద్దంముందు నిలబడి ట్రై చేసింది. ఉహు లాభంలేదు. కళ్ళు పిండుకొన్నా ఎర్రజీరలు రాలేదు సరికదా కళ్ళ నీళ్లొచ్చాయి. ఇలా లాభం లేదనుకొంది. విసుగ్గా సోఫాలో వాలి శరభ్‌గాడు వదిలేసిన పత్రిక తాజా కాపీ చేతిలోకి తీసుకొని సువర్చల అన్న పేరును మురిపెంగా చూసుకొంటుంటే అప్పుడు కనపడింది. ఓ ప్రకటన.

"మనసులో దిగులుగా ఉందా, ఎవరికీ చెప్పుకోలేని దిగులుతో వేగిపోతున్నారా. చెప్పుకోండి మీ నెచ్చెలికి. ఇదే పేజీలో వచ్చేవారం నుంచి కొత్త శీర్షిక "నెచ్చెలికి లేఖ"

ఉత్సాహం పొంగివచ్చింది సువర్చలకు.

"డియర్ నెచ్చెలీ"

ఇంతకుముందే మా ఇంట్లో ఓ పెద్ద కురుక్షేత్ర యుద్ధం జరిగింది. మా పక్కింటి వెధవన్నరవెధవ వంట బాగా చేస్తాడని మెచ్చుకొన్నా. అది తప్పట. విన్నావా నెచ్చెలీ. మా ఆయన, మా అత్తగారు ఇద్దరూ అదవి జాతే....ప్రపంచంలో మంచికి స్థానం లేదనిపిస్తోంది. చెప్పు నెచ్చెలీ నిజం చెప్పూ....

ఆవేశంతో రాసేస్తోంది సువర్చల.... (విపుల)